రజనీతో పూజ డ్యాన్స్.. డ్యాన్స్?

మిగతాది 8లో

తెలుగు దినపత్రిక

RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY


ఇదండీ..కబురు..




మా విధులకు ఆటంకం లేకుండా సహకరించినందుకు థాంక్యూ సార్.. నిజమైన ఫ్రెండ్లీ-గవర్నమెంటు అంటే మీరే!


సంపుటి : 23 సంచిక : 67 | గురువారం ఫిబ్రవరి 20 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8




## పేదలకు తెలంగాణ సర్కార్ గుడ్

# ఎల్ఆర్ఎస్ పథకంలో 25% రాయితీ నిర్ణయం

- లే అవుట్లలో రిజిస్టర్ కాని 90% ప్లాట్లకు రెగ్యులరైజేషన్ అవకాశాన్ని కల్పించారు.
- సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ ఉన్న ప్లాట్లకు కూడా 25% రాయితీ అందించడానికి నిర్ణయించారు.
- నిషేధిత భూముల విషయంలో కఠినంగా వ్యవహరించాలని మంత్రులు అధికారులకు ఆదేశించారు.
- ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చెల్లింపులు చేయాలని సూచించారు.

2లో..

**కబురు న్యూస్,హైదరాబాద్,ఫిబ్రవరి19:** రాష్ట్రంలోని పేదలకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఎల్ఆర్ఎస్ (భూ క్రమబద్ధీకరణ పథకం) అమలులో వేగం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం అమలు ప్రగతిపై బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుదిల్ల శ్రీధర్ బాబు లు పాల్గొన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం అమలులో వేగం పెంచే కార్యక్రమంలో భాగంగా 25 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ప్లాట్ కొనుగోలుదారులకు ఈ రాయితీని మార్చి 31 వరకు వెసులుబాటు కల్పించింది. దీంతో పాటు వ్యక్తిగతంగా ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకోని వారికి, లే అవుట్లో పెద్ద సంఖ్యలో విక్రయం కాకుండా ఉన్న ప్లాట్ల రెగ్యులరైజేషన్ కు పలు వెసులుబాట్లు కల్పిస్తూ మంత్రులు నిర్ణయం తీసుకున్నారు.



## రైతుల ఉసురు తగిలే

# KCR మంచాన పడ్డడు

**కబురు న్యూస్,సూర్యాపేట ఫిబ్రవరి19:** పెద్దగట్టు లింగమంతుల స్వామి ఘాట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం (ఫిబ్రవరి 19) దురాజ్ పల్లి లింగమంతుల స్వామి వారిని మంత్రి కోమటిరెడ్డి దర్శించుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, బత్తుల లక్ష్మారెడ్డి, పటేల్ రమేష్ రెడ్డి, తదితర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. దర్శనం అనంతరం మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పెద్దగట్టు ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.80 కోట్లు అవసరమయిన మంజూరు చేస్తామన్నారు. వయసు పైబడిన భక్తులకు గుట్టు ఎక్కడం కష్టంగా మారిందని.. వచ్చే జాతర నాటికి ఘాట్ రోడ్డు, విశ్రాంతి భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే ఏడాదిలోనే పెద్దగట్టు పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రారంభిస్తామని అన్నారు.ఇక, మంగళవారం పెద్దగట్టుకు వచ్చి.. రైతులకు నీరివ్వని కాంగ్రెస్ సర్కారుకు రైతుల ఉసురు తగులుతుందన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మంత్రి కోమటిరెడ్డి ఫైర్ అయ్యారు. రైతుల ఉసురు తగలేది కాంగ్రెస్?కు కాదని.. రైతుల ఉసురు తగిలే కేసీఆర్ మంచానికి పడ్డారు.. కవిత జైలు పాలయ్యారని కౌంటర్ ఇచ్చారు.

2లో..



2లో..

## రైతాంగాన్ని ఆదుకోవాలి.. లేదంటే తీవ్ర పరిణామాలు

**కబురు న్యూస్,వరంగల్: ఫిబ్రవరి19:** గ్రీన్ఫీల్డ్ హైవే భూసేకరణతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నేషనల్ హైవే కోసం సేకరించే భూములను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని..

## వంద-శాతం మళ్లీ

# అధికారంలోకి వస్తాం

- "భారాస మాత్రమే తెలంగాణ కోసం పోరాడగలదు."
- "వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తాం."
- ఏప్రిల్ 10న హైదరాబాద్లో భారాస ప్రతినిధుల సభ.
- ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ.
- ఏడాది పొడవునా రజతోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలి.
- "ప్రజల శాశ్వత విజయం కోసం భరాస పోరాటం కొనసాగించాలి."

**కబురు న్యూస్,హైదరాబాద్,ఫిబ్రవరి19:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజల కోసం పోరాటాలు చేయాలని భారాస అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్లో కేసీఆర్ అధ్యక్షతన భారాస విస్తృత స్థాయి కార్యకవర్గ సమావేశం జరిగింది. పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణ, సభ్యత్వ నమోదు, సంస్థాగత కమిటీలు, ప్లీనరీ అంశాలపై చర్చించారు. పార్టీ ఆవిర్భావం మొదలు ఇప్పటి వరకు సుదీర్ఘ ప్రస్థానంపై కేసీఆర్ మాట్లాడారు. ఉద్యమం, తెలంగాణ అభివృద్ధి కోసం చేసిన కృషిని వివరించారు.



మిగతాది 2లో



## ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్‌రావుకు ఊరట

**కబురు న్యూస్,హైదరాబాద్,ఫిబ్రవరి19:** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు ఊరట లభించింది. పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన కేసు విచారణపై హైకోర్టు స్టే విధించింది. తదుపరి ఆదేశాలిచ్చేవరకూ అరెస్ట్ చేయొద్దని న్యాయస్థానం ఆదేశించింది.తన ఫోన్ ట్యాప్ చేశారంటూ రియల్టర్ చక్రధర్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైన సంగతి తెలిసిందే. తదుపరి విచారణను హైకోర్టు మార్చి 3వ తేదీకి వాయిదా వేసింది. కాగా, ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాధా కిషన్ రావుకు కూడా ఊరట లభించింది.



## మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే.. ఇది పక్కా..

**కబురు న్యూస్,హైదరాబాద్,ఫిబ్రవరి19:** బీఆర్ఎస్ శ్రేణులు వాస్తవాలు మాట్లాడుతుంటే.. అవి జీర్ణించుకోలేని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసహనంతో మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు.కేసీఆర్ అధ్యక్షతన బుధవారం తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఆ సమావేశంలో పార్టీ పని అయిపోయిందంటూ వ్యతిరేక ప్రచారం చేసిన బీఆర్ఎస్ నేతలపైన కేసీఆర్ మండిపడ్డారు.

2లో



2లో..

## తెలంగాణకు రక్షణ కవచం

# బీఆర్ఎస్సే

**కబురు న్యూస్,హైదరాబాద్,ఫిబ్రవరి19:** తెలంగాణకు రక్షణ కవచం బీఆర్ఎస్సేనని.. ప్రజా పోరాటంలో బీఆర్ఎస్ వెనక్కి తగ్గదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్లో జరిగిన ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాల సాధనకు బీఆర్ఎస్ ఒక్కటే మార్గమన్నారు. "తెలంగాణ అస్థిత్వం, పరిరక్షణే మాకు ముఖ్యం. ప్రజల అస్తిత్వం కోసం పనిచేయాలని సమావేశం నిర్ణయించింది. కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచింది. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సంక్షోభంలో కూరుకుపోయింది" అని కేటీఆర్ పేర్కొన్నారు.

తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# ఆత్మావలోకనం అవసరం

విశ్వసనీయతను కాపాడుకునే విషయంలో, విలువలు పాటించే అంశంలో పట్టింపు ఉన్నట్టు కనబడకపోతే వ్యక్తులైనా, వ్యవస్థలైనా విమర్శలపాలు కాకతప్పదు. తన రిటైర్మెంట్‌కు ఒక రోజు ముందు సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల సంఘం(ఈసీ) చీఫ్ రాజీవ్ కుమార్ తమపై వస్తున్న విమర్శలకూ, ఆరోపణలకూ ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో ఓడిన వారు ఫలితాలను జీర్ణించుకోలేక ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నది ఆయన అభిప్రాయం. దీనికి మూలం ఎక్కడుందో, తామెంత వరకూ బాధ్యులో ఒక్కసారి ఆత్మావలోకనం చేసుకునివుంటే సమస్య మొత్తం ఆయనకే అర్థమయ్యేది. ఈసీకి ఇప్పటికీ ఏదోమేర విశ్వసనీయత ఉందంటే అది మాజీ సీఈసీ టీఎన్ శేషన్ పెట్టిన భిక్ష. అంతకుముందు ఈసీ ఉనికి పెద్దగా తెలిసేది కాదు. అది రాజ్యాంగ సంస్థ అనీ, దానికి విస్తృతాధికారాలు ఉంటాయనీ ఎవరూ అనుకోలేదు. శేషన్ తీరు నియంతను పోలివుంటుందని, తానే సర్వంసహాధికారినన్నట్టు ప్రవర్తిస్తారని ఆరోపణలొచ్చిన మాట వాస్తవమే అయినా ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించటంలో, అవసరమైతే ఎన్నికలను రద్దు చేయటం వంటి కఠిన చర్యలకు వెనకాడకపోవటంలో ఆయనకెవరూ సాటిరారు. అనంతరం వచ్చిన సీఈసీల్లో అతి కొద్దిమంది మాత్రమే శేషన్ దరిదాపుల్లోకొచ్చే ప్రయత్నం చేశారు. గత కొన్నేళ్లుగా అసలు ఆ ఊసే లేకుండా కాలక్షేపం చేసినవారే అధికం. శేషన్ నెలకొల్పిన ప్రమాణాలను అందుకోకపోతే పోయారు... కనీసం ఆ సంస్థ ఔన్నత్యాన్ని దిగజార్చకపోతే బాగుండునని కోరు కోవటం కూడా అత్యాశేనన్న చందంగా పరిస్థితి మారింది. దాని స్వతంత్రత, తటస్థత, విశ్వస నీయత ప్రశ్నార్థకమయ్యే రోజులొచ్చాయి. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించటానికి రాజ్యాంగం సృష్టించిన సంస్థ ఈసీ. అది తనకు ఎదురయ్యే అనుభవాలతో తన అధికారాలను పునర్నిర్వచించుకునే సంప్రదాయాన్ని కొనసాగిస్తే, దానిద్వారా రాజ్యాంగం ఆశించిన ఉద్దేశాలు నెరవేరేవి. ఈసీ ఏక సభ్య సంఘంగా మొదలై త్రిసభ్య సంఘమైంది. కానీ ఉన్న అధికారాలనే సక్రమంగా వినియోగించుకోలేని అశక్తతకు లోబడుతుండటం చేదు వాస్తవం. రాజ్యాంగం ఈసీకి స్వతంత్ర ప్రతిపత్తి ఇచ్చినా దాన్ని వినియోగించుకోవటంలో ఆసక్తి కనబరుస్తున్న దాఖలా లేదు. పార్టీలను నమోదు చేసుకునే అధికారం 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం ఈసీకి ఇస్తోంది. ఆ నమోదును రద్దు చేసే లేదా ఆ పార్టీనే రద్దుచేసే అధికారం మాత్రం లేదు. మరింత స్వతంత్రంగా, మరింత దృఢ సంకల్పంతో వ్యవహరించమని వేర్వేరు తీర్పుల్లో సుప్రీంకోర్టు చేసిన సూచనలకు అనుగుణంగా ఈసీ వ్యవహరించివుంటే పరిస్థితి వేరేలా ఉండేదేమో! గెలిచిన పార్టీలకు ఆరోపణలు చేసే అవసరం తలెత్తదు. అంతటి త్యాగధనులు కూడా ఎవరూ లేరు. కానీ మాజీ సీఈసీ ఎస్వై ఖురేషీ చేసిన ఆరోపణల మాటేమిటి? వాటినీ కొట్టిపారేస్తారా? కనీసం ఆయన వ్యాఖ్యలపైన స్పందించలేని అచేతన స్థితికి ఈసీ చేరుకోవటాన్ని రాజీవ్ ఏరకంగా సమర్థించుకోగలరు? రోజులు గడిస్తే తప్పులు సమసిపోతాయా? ఇంత అమాయకత్వాన్ని నటిస్తున్న రాజీవ్ నిరుడు మేలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల తంతుపై వచ్చిన విమర్శలకు ఈ ఎనిమిది నెలల్లో ఒక్కసారైనా జవాబిచ్చారా? పోలింగ్ జరిగినరోజు రాత్రి 8 గంటలకు వోటింగ్ శాతాన్ని 68.12 అని ప్రకటించి, మరో మూడు గంటలు గడిచాక దాన్ని ఏకంగా 76.50 శాతమని చెప్పటం, మరో నాలుగు రోజులకు మళ్లీ గొంతు సవరించుకుని 80.66గా మార్చటంలోని మర్మమేమిటి? ఈ పెంపు ఏకంగా 12.5 శాతం. దాన్ని అంకెల్లోకి మారిస్తే 49 లక్షలు! ఈ మాయా జాలం ఏమిటో, కొత్తగా పుట్టుకొచ్చిన ఈ 49 లక్షలమంది కథాకమామీషు ఏమిటో చెప్పాల్సిన బాధ్యత ఆయనకు ఉండనవసరం లేదా? తమకై తాము ప్రజలను అయోమయంలోకి నెట్టి, తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసి రాజకీయపక్షాలపై బండరాళ్లు వేయటం ఏ రకమైన నీతి? మహారాష్ట్ర ఎన్నికలు సైతం ఈ బాణీలోనే సాగాయి. పోలింగ్ ముగిసిన సాయంత్రం 58.2 శాతం (6,30,85,732) మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారని చెప్పిన ఎన్నికల సంఘమే రాత్రికల్లా 65.02 శాతమని మార్చింది. కౌంటింగ్‌కు ముందు అది కాస్తా 66.05 శాతానికి పెరిగింది. అంటే వోటింగ్‌లో 7.83 శాతం పెరుగుదల. అంకెల్లో చూస్తే స్థూలంగా 76 లక్షలు. ఇలాంటి దుఃస్థితి అఘోరించినప్పుడు సందేహాలు రావా? ఆరోపణలు వెల్లువెత్తవా? రాజీవ్ మీడియా సమావేశం రోజునే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీలతో కూడిన కమిటీ కొత్త ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా జ్ఞానేశ్ కుమార్‌ను ఎంపిక చేసింది. ఇది సరికాదంటూ విపక్ష నేత రాహుల్‌గాంధీ అసమ్మతి నోట్ అందజేశారు. ఇలా వివాదాస్పద ఎంపికలోనే సమస్యకు బీజం ఉంటుందని, అటుపై ఈసీ నడతను నిశితంగా పరిశీలించటం మొదలవుతుందని రాజీవ్ గుర్తిస్తే మంచిది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఈసీ విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతున్నదని ఖురేషీ విమర్శిస్తే ఇదే రాజీవ్ నొచ్చుకుని 'ఎంతమంది సీఈసీలు ప్రవర్తనా నియమావళికి సంబంధించిన ఫిర్యాదులు అందుకున్నారో, వాటి ఆధారంగా ఎందరిపై చర్య తీసుకున్నారో మేం ఆరా తీశాం' అని గంభీరంగా ప్రకటించారు. అదేమిటో బయటపెట్టాలని ఖురేషీ సవాలు చేస్తే ఈ ఆరేళ్లుగా మౌనమే సమాధానమైంది. ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించటం లేదని చెప్పటానికి ఇది చాలదా?

# పేదలకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి

ఒక లేఅవుట్లో 10 శాతం ప్లాట్లు రిజిస్టర్ అయి ఉండి మిగిలిపోయిన 90 శాతం ప్లాట్ లకు ఎల్ఆర్ఎస్ పథకంలో రెగ్యులరైజేషన్ కు అవకాశం కల్పించారు. వీరు కూడా మార్చి 31 వరకు 25 శాతం రాయితీ పొందే అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ప్లాట్లు కొనుగోలు చేసి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ కలిగిన వారికి కూడా 31 లోగా ఎల్ఆర్ఎస్ చేసుకుంటే 25 శాతం రాయితీ కల్పిస్తూ మంత్రులు నిర్ణయం తీసుకున్నారు. పేద ప్రజలు, గత నాలుగు సంవత్సరాల నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం గురించి ఎదురు చూస్తున్నారు. పేదల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా మంత్రులు విజ్ఞప్తి చేశారు. ఈ పథకాన్ని రోజువారీగా సమీక్షించి నిర్ణయించారు.

ఎల్ఆర్ఎస్ అమలులో భాగంగా పలు వెసలుబాట్లు కల్పిస్తున్న నేపథ్యంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండాలని, వీటి విషయంలో కఠినంగా వ్యవహరించాలని మంత్రులు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా ఎల్ఆర్ఎస్ పథకాన్ని సులభతరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఎల్ఆర్ఎస్ కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎల్ఆర్ఎస్ రెగ్యులరైజేషన్ కోసం సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్దనే చెల్లింపులు చేసి ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పురపాలక పట్టణ అభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## వందశాతం మళ్లీ అధికారంలోకి వస్తాం

మొదటిపేజీ తరువాయి

"భారాస మాత్రమే తెలంగాణ కోసం పోరాడగలదు. ప్రజల కష్టాలు భారాసకు మాత్రమే తెలుసు. వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తాం. పోరాడి సాధించుకున్న తెలంగాణ మళ్లీ వెనక్కిపోతోంది. పాతికేళ్ల స్ఫూర్తితో మళ్లీ తెలంగాణను నిలబెట్టుకునేందుకు పోరాడాలి."ఏడాది పొడవునా భారాస రజతోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలి. ఏప్రిల్ 10న హైదరాబాద్‌లో భారాస ప్రతినిధుల సభ. రజతోత్సవ కార్యక్రమాల కోసం సబ్ కమిటీలు ఏర్పాటు చేయాలి. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఇక నుంచి దృష్టి సారిస్తాం. ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ ఉంటుంది.

ఏప్రిల్ 10 నుంచి 27 వరకు సభ్యత్వ నమోదు. ఆ తర్వాత సంస్థాగత కమిటీల ఏర్పాటు. అక్టోబరు, నవంబర్‌లో పార్టీ అధ్యక్షత ఎన్నిక. పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అందరూ కష్టపడాలి. ఒక్కసారి ఓటమికే కొట్టుకుపోయే పార్టీ కాదు భారాస. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించిన పార్టీ. ఎమ్మెల్యేలు పార్టీ మారిన 10 స్థానాల్లో ఉప ఎన్నికలు ఖాయం. ప్రజల్లో ప్రభుత్వం గ్రాఫ్ పడిపోతోంది.. ఇక లేవదు. పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పటిష్ఠంగా నిర్మించాలి. పార్టీ, ప్రజల శాశ్వత విజయం కోసం పనిచేయాలి" అని కేసీఆర్ సూచించారు.

## మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే.. ఇది పక్కా..

మొదటిపేజీ తరువాయి

'ఎంపీ ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందగానే పార్టీ పని అయిపోందని మన పార్టీ నేతలే ప్రచారం చేశారు. అందుకే 10 మంది ఎమ్మెల్యేలు నైరాశ్యంతో పార్టీ మారారు. ఇలాంటి ప్రచారం చేయడం సరైంది కాదు. ఇది ఖండించ దగ్గ విషయం' అని సీరియస్ టోన్‌తో అన్నారాయన. అయితే.. ఇప్పటికీ మించి పోయింది ఏమీ లేదని.. లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీ కోసం అంతా కష్టపడాలని సూచించారు.

కేసీఆర్ చేసిన ఆ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. 'కేసీఆర్‌కు ప్రజాస్వామ్యం అంటే విలువ లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో రెండు హామీలను అమలు చేసాం. పంట బోనస్ , రైతు భరోసా పెంపు , 55 వేల ఉద్యోగాలు, డీఎస్సీ పోస్టింగులు ఇలా చెప్పుకుంటే పోతే అనేకం చేశాం. ఇంకా చేస్తాం.

కేసీఆర్ వ్యాఖ్యల్లో అసహనం తప్ప మరొకటి కనబడటం లేదు. అధికారం దరిదాపుల్లో కనబడక పోవడంతోనే కేసీఆర్‌లో అసహనం ఎక్కువై ఇలా మాట్లాడుతున్నారు. తెలంగాణ ప్రజలు పదేళ్లు అధికారం ఇస్తారు... ఇది పక్కా. ఆర్థిక విధ్వంసం తర్వాత కూడా పాత పథకాలను ఒక్కటి కూడా రద్దు చేయకుండా ,మేము ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. కేంద్రం ఇంకా సహకరిస్తే.. మరింత అభివృద్ధి చేస్తాం. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కేసీఆర్ కలిసి రావాలి. తమిళనాడు తరహాలో రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పక్షాలు ప్రభుత్వంతో కలిసి పనిచేయాలి. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీ వెళ్తాం. ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ కలసి రావాల్సిందేనని డిమాండ్ చేశారు పొన్నం ప్రభాకర్.

## తెలంగాణకు రక్షణ కవచం బీఆర్ఎస్సే

మొదటిపేజీ తరువాయి

విస్తృత స్థాయి సమావేశంలో 30 మంది వారి అభిప్రాయాలు చెప్పారు. తెలంగాణ ప్రజల పండుగగా బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించాలని కేసీఆర్ సూచించారు. ఏడాది పాటు సిల్వర్ జూబ్లీ వేడుకలు జరపాలని కేసీఆర్ నిర్ణయించారు. సిల్వర్ జూబ్లీ వేడుకలకు వారం రోజుల్లో కమిటీలు ప్రకటిస్తాం. అందరిని భాగ స్వామ్యం చేస్తూ సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తాం.ఏప్రిల్ రెండో వారంలో ప్రతినిధుల సమావేశం ఉంటుంది. ఏప్రిల్ 27న బహిరంగ సభ నిర్వహిస్తాం. పార్టీ సభ్యత్వ సమోదు కార్య క్రమం. పార్టీ నేతలకు శిక్షణ తరగతులు చేపడతాం. త్వరలోనే గ్రామ స్థాయి, మండల స్థాయి, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలతో పాటు అధ్యక్షలను ఎంపిక చేస్తాం. 2026 ఏప్రిల్ వరకు సిల్వర్ జూబ్లీ వేడుకలతో పాటు, ప్రజా పోరాటాలు చేస్తాం. రేవంత్ రెడ్డిని వాళ్ల కేబినెట్ మంత్రులే పట్టించుకోవడం లేదు. 42 శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారో రేవంత్ చెప్పాలి" అని కేటీఆర్ నిలదీశారు.

## రైతాంగాన్ని ఆదుకోవాలి..
## లేదంటే తీవ్ర పరిణామాలు

మొదటిపేజీ తరువాయి

ఇందుకు కేంద్రం డబ్బులు చెల్లిస్తుందని చెప్పారు. వరంగల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈటల మాట్లాడారు.గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు వేగంగా జరుగుతున్నా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా సీఎం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అభివృద్ధికి భాజపా వ్యతిరేకం కాదన్నారు. తెలంగాణ రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని.. లేదంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అవసరమైతే అన్నదాతల తరఫున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఈటల అన్నారు.

## ప్రతీది గుర్తు పెట్టుకుంటున్నా...

### – హోటల్ మూసివేయడంపై కేటీఆర్ మండిపాటు

**హైదరాబాద్,ఫిబ్రవరి19**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడతుందని, మొన్న కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా స్వీట్లు పంచినందుకు టీచర్‌ను సస్పెండ్ చేశారని, ఇప్పుడు నా ఫొటో పెట్టుకున్నందుకు టీ హోటల్‌నే మూసివేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ప్రతీది గుర్తుపెట్టుకుంటున్నానని.. ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇదే మాట మీద ఉంటానని మీకు మాట ఇస్తున్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు టీ షాపు యజమాని బత్తుల శ్రీనివాస్ ఆవేదనతో మాట్లాడుతున్న ఒక వీడియోను షేర్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన బత్తుల శ్రీనివాస్ బతుకమ్మ ఘాట్ వద్ద గత నాలుగేళ్లుగా 'కేటీఆర్ టీ స్టాల్' నడిపిస్తున్నాడు. హోటల్ బోర్డుపై కూడా కేటీఆర్ ఫొటో పెట్టుకున్నారు. ఇది గమనించిన సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆ హోటల్‌ను మూసేయించారు. అసలు ఆ టీ స్టాల్‌కు ట్రేడ్ లైసెన్స్ ఉందా? లేకుంటే హోటల్‌ను సీజ్ చేయండి అంటూ మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ హుకుంతో వెంటనే రంగంలోకి దిగిన మున్సిపల్ సిబ్బంది టీ స్టాల్‌ను బలవంతంగా మూసివేయించారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి రూ. 4.20 లక్షల కోట్లు జరిమానా వేసిన తప్పులేదు : కేటీఆర్

**హైదరాబాద్,ఫిబ్రవరి19**

సింగపూర్ పార్లమెంట్‌లో రెండు అబద్ధాలు చెప్పిన ఎంపీకి 14వేల డాలర్ల జరిమానా విధించిన విషయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తావించారు. మరి కాళేశ్వరం గురించి, రాష్ట్ర అప్పుల గురించి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి, రైతు రుణమాఫీ గురించి, రైతు బంధు గురించి, నాలుగు వేల పింఛన్లు అని, మహిళలకు రూ.2500 అని.. ఇలా 420 అబద్ధాలు చెప్పిన ముసలి నక్క కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి 4.20 లక్ష కోట్ల జరిమానా వేసిన తప్పులేదని విమర్శించారు. పార్లమెంటరీ కమిటీ ముందు అబద్ధాలు చెప్పినందుకు భారత సంతతికి చెందిన సింగపూర్ ఎంపీ ప్రీతమ్ సింగ్ (48)కి అక్కడి కోర్టు జరిమానా విధించింది. ఒక్కో అబద్ధానికి రూ.7వేల సింగపూర్ డాలర్ల చొప్పున.. రెండు అబద్ధాలకు 14వేల సింగపూర్ డాలర్లను కట్టాలని ఆదేశించింది.

## తాళం వేసిన ఇండ్లే టార్గెట్

### రూ.11 లక్షల విలువ గల సొత్తు రికవరీ

**హైదరాబాద్,ఫిబ్రవరి19**

తాళం వేసిన ఇండ్లనే టార్గెట్‌గా చేసుకొని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ఘరానా దొంగ మిట్టపల్లి లక్ష్మణ్‌ను మల్లాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం మెటపల్లి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నిరంజన్ రెడ్డి వివరాలను వెల్లడించారు. నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ అలియాస్ రవి అలియాస్ విజయ్(28) అను అతను నిజామాబాద్, నిర్మల్, కరీంనగర్, ఆదిలాబాద్ తదితర జిల్లాలో దొంగతనాలకు పాల్పడ్డాడు. వివిధ పోలీస్ స్టేషన్స్ పరిధిలో ఇప్పటి వరకు 40 కేసులు నమోదవగా పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. గత కొంతకాలంగా మెటపల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో తాళం వేసిన ఇళ్లలో వరుసగా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి గాలింపులు చేపట్టారు. ఈ క్రమంలో మల్లాపూర్ ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మంగళవారం మధ్యాహ్నం ముత్యంపేట నిజాం చెక్కర ఫ్యాక్టరీ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మోటార్ సైకిల్ పై వస్తున్న అనుమానాస్పద వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలింది. నిందితుడిని అరెస్టు చేసి రూ.11 లక్షల విలువగల 103 గ్రాముల బంగారం 125.3 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దొంగను చాకచక్యంగా పట్టుకొని సొత్తును రికవరీ చేసిన మల్లాపూర్ ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ రాములు అభినందించారు.

## కేసీఆర్ అధ్యక్షతన కీలక సమావేశం

### – పార్టీ రజతోత్సవాలపై చర్చ

**హైదరాబాద్,ఫిబ్రవరి19**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ కీలక సమావేశం జరుగుతోంది. 2001 ఏప్రిల్ 27న ఆవిర్భవించిన బీఆర్ఎస్ పార్టీ 25వ వసంతంలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఈ భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తెలంగాణభవన్‌లో రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సమావేశానికి హాజరయ్యారు. ఈ నెలాఖరులో బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ నాయకత్వం మొదట నిర్ణయించింది. అయితే బహిరంగ సభను ఈ నెలలో నిర్వహించడం కన్నా.. పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజు నిర్వహిస్తే బాగుంటందాన్న అంశంపై చర్చించారు. అధ్యక్ష ఎన్నిక నాటికి పార్టీ సభ్యత్వ నమోదు, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి దాకా పార్టీ ప్రధాన కమిటీలు, అనుబంధ కమిటీల ఎన్నికల ని ర్వహణ, సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో అధ్యక్ష ఎన్నిక నిర్వహణ తదితర అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణ, అనుసరించే వ్యూహంపై పార్టీ శ్రేణులకు అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

# కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక బడ్జెట్ నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వం దిష్టి బొమ్మ దగ్ధం...

**కబురు న్యూస్,బోధన్ ఫిబ్రవరి 19..**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక బడ్జెట్ ను నిరసిస్తూ బుధవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కేంద్ర వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా టియూసిఐ రాష్ట్ర నాయకులు మల్లేష్, ఇఫ్టూ నాయకులు వరదయ్య, సీఐటీయూ నాయకులు శంకర్ గౌడ్ లు మాట్లాడుతూ ఇతర పార్టీల మద్దతుతో మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏ మాత్రం ప్రజామోదమైన బడ్జెట్ ను ప్రవేశపెట్టలేదని బడా పెట్టుబడుదారుల, కార్పోరేట్ల బడ్జెట్ ఇదని దుయ్యబట్టారు. గతంలో రైతులు 13 నెలల పాటు ఢిల్లీలో మోడీ తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడితే, ఆ రోజు రైతాంగానికి క్షమాపణ చెప్పిన మోడీ, వాటి విషయంలో మోడీ ప్రభుత్వం ఒక్క అడుగు ముందుకు వేయలేదని విమర్శించారు. దేశ కార్మిక వర్గం పోరాడి,



అనేక త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ,కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్ లను తీసుకొచ్చిందని 16 గంటలు పని దినాలను పనిచేయించాలని కార్పొరేట్ కంపెనీల మెప్పు పొందే విధానాలను అమలు చేయిస్తుందని, బావి భారత పౌరులుగా తీర్చిదిద్దే విద్యా రంగానికి తగినంత బడ్జెట్ ని కేటాయించలేదని, దేశ ప్రజల ఆరోగ్యం కోసం వైద్య రంగానికి తగినంత బడ్జెట్ ను కేటాయించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గానికి సమాన పనికి సమాన వేతనం సుప్రీంకోర్టు తీర్పు, కనీస వేతనాల అమలు విషయం వారి ఉద్యోగ,



సామాజిక భద్రత విషయాల గురించి ఉపాధి హామీ కూలీల కూలీ రేట్లు, పనిదినాల పెంపు, దానికి సంబంధించిన బడ్జెట్ పెంపు లేకపోవడాన్ని విమర్శిస్తూ,ఈ బడ్జెట్ ను తిరిగి కార్మిక వర్గానికి ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించేలా రైతాంగానికి, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించేలా సవరణ చేసి బడ్జెట్ ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియూసిఐ నాయకులు ఇర్షాద్, అంజాద్, శాంతాబాయ్, పోశెట్టి, కల్పన, సుధాకర్, సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, గంగాధర్, ఇఫ్టూ నాయకులు సాయిలు, రాజకుమార్, లక్ష్మణ్ గౌడ్, వినోద్ లు, పిడిఎస్యూ నాయకులు గౌతమ్ కుమార్, భీమ్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ ఎన్నికల్లో గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు... ఎంపీ సురేష్ షెట్కర్

**కబురు న్యూస్ బాన్సువాడ ఫిబ్రవరి 19**
జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఎంపీగా ఆశీర్వదించి బాన్సువాడ నియోజకవర్గం నుండి మెజార్టీ ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు అని ఎంపీ సురేష్ షెట్కర్ అన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణ శివారులోని ఎస్ఎంబి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి ఆయన పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని, ఏడాదిలోనే 56వేల ఉద్యోగాలను కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టబద్రులు అండగా నిలిచి అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేయడంతో



బలగం ఎక్కువైందని ఈసారి మెజార్టీ ఎక్కువ తీసుకురావాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లను నియోజకవర్గానికి 3,500 ఇండ్లను కేటాయించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. ఈ సందర్భంగా ఎంపి సురేష్ శెట్కార్ ను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ డిసిపి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, టిపిసిసి



డెలిగేట్ కూనిపుర్ రాజారెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు సురేష్ బాబా, గైక్వాడ్ హనుమంతు దుర్గం శ్యామల, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు నార్ల సురేష్ గుప్తా, నాయకులు శ్రీనివాస్ గౌడ్,అంబర్ సింగ్, కొట్టం మనోహర్, పుప్పాల శంకర్, లక్ష్మణ్, రఘు, బుజ్జి, పిట్ల శ్రీధర్, గంగుల గంగారం, నార్ల నందకిషోర్ గుప్తా, అందె రమేష్,తోట అరుణ్, గౌస్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి...







**కబురు న్యూస్,బోధన్ ఫిబ్రవరి 19..**
పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. బుధవారం బోధన్ డివిజన్లోని సాలూర మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సాలూర తహసీల్దార్ శశి భూషణ్ తో కలిసి సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించి, ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆయన సూచించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ విద్యలో మెరుగు పరచి మంచి ఉత్తీర్ణత సాధించిందేందుకు తగిన కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు.


# విద్యార్థులందరి ఆధార్ బయోమెట్రిక్ ను అప్ డేట్ చేయించాలి

**– కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...**

**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,ఫిబ్రవరి 19 :**
ఆయా పాఠశాలల్లోని విద్యార్థులందరి ఆధార్ బయోమెట్రిక్ ను అప్ డేట్ చేయించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. తద్వారా భవిష్యత్తులో జేఈఈ వంటి పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తవని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. హైదరాబాద్ నుండి వీ.సీ ద్వారా డిప్యూటీ డైరెక్టర్ చైతన్య రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఐదేళ్లలోపు వయస్సు గల చిన్నారులు 61412 మంది,



పదిహేను సంవత్సరాల వయస్సు గల వారు 40275 మంది ఆధార్ బయోమెట్రిక్ అప్ డేట్ పెండింగ్ లో ఉందని డీ.డీ చైతన్యరెడ్డి తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థుల బయోమెట్రిక్ అప్ డేట్ కు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ను ఆదేశించారు. ఆయా పాఠశాలల వారీగా ముందస్తు సమాచారం అందిస్తూ బయోమెట్రిక్ అప్ డేట్ జరగని విద్యార్థులతో అప్ డేట్ చేయించాలన్నారు. ముందుగా నిజామాబాద్ నగరంలోని పాఠశాలల్లో ఈ ప్రక్రియను వెంటనే చేపట్టాలని, నెల రోజుల వ్యవధిలో అన్ని పాఠశాలల్లో విద్యార్థులందరి బయోమెట్రిక్ అప్డేట్ జరిగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. కాగా,




అప్పుడే పుట్టిన శిశువు మొదలుకుని ఐదేళ్ల లోపు చిన్నారులందరికి తప్పనిసరిగా తల్లిదండ్రులు ఆధార్ నమోదు చేసేలా జిల్లా యంత్రాంగం తరపున చొరవ చూపాలని డిప్యూటీ డైరెక్టర్ చైతన్య రెడ్డి కలెక్టర్ ను కోరారు. ఆధార్ సేవలలో సాంకేతిక సమస్యలు, ఇతర ఇబ్బందులను పరిష్కరించేందుకు జిల్లాలో మెగా క్యాంపు నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఈ.డీఎం కార్తీక్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, లీడ్ బ్యాంకు మేనేజర్ అశోక్ చౌహాన్, డీడబ్ల్యుఓ రసూల్ బీ, డీఎస్సీడీఓ నిర్మల, పోస్టల్ అధికారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# శివాజీ విగ్రహానికి నివాళులర్పించిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్



**కబురు న్యూస్ బాన్సువాడ ఫిబ్రవరి 19**
బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని పాత బాన్సువాడలో బుధవారం శివాజీ జయంతిని పురస్కరించుకొని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ స్థానిక నాయకులతో కలిసి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజ్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోచి గణేష్, రమేష్ యాదవ్, గౌస్, చాకలి సాయిలు, చాకలి మహేష్, సంజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసిన తపస్ సభ్యులు



**కబురు న్యూస్ బాన్సువాడ ఫిబ్రవరి 19**
బాన్సువాడ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శివాజీ జయంతిని పురస్కరించుకుని తపస్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు ఎలాంటి ఆందోళన చెందకుండా మంచిగా చదువుకొని పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్,తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భునేకర్ సంతోష్, రాష్ట్ర బాధ్యులు రవీందర్ ఆర్య, తారాచంద్, కిష్టయ్య, సాయిలు,రాములు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడ బయలుదేరిన బీర్కూర్ కాంగ్రెస్ శ్రేణులు



**కబురు న్యూస్ బీర్కూర్ ఫిబ్రవరి 19**
బాన్సువాడ పట్టణ శివారులోని ఎస్ఎంబి ఫంక్షన్ హాల్ లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాక సమావేశానికి బీర్కుర్ పార్టీ మండల అధ్యక్షుడు బోయిని శంకర్ ఆధ్వర్యంలో బీర్కూర్ నుండి కాంగ్రెస్ శ్రేణులు బాన్సువాడ బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాంత్ రెడ్డి, యమా రాములు, సానిపు గంగారం, శశికాంత్, దొంతురం కాశిరం, ఆరిఫ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# శివాజీ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్ కాసుల



**కబురు న్యూస్ బాన్సువాడ ఫిబ్రవరి 19**
బాన్సువాడ పట్టణంలోని గౌలిగూడ చౌరస్తాలో బుధవారం చత్రపతి మహారాజ్ శివాజీ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ఆగ్రో కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. శివాజీ మహారాజ్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగం గంగాధర్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖలేక్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాసూదన్ రెడ్డి, నార్ల రవీందర్ గుప్తా, ఎజాస్,ప్రదీప్ పటేల్, బోడ భాస్కర్, గౌలిగూడ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడతో నాకు విడదీయరాని అనుబంధం ఉంది...

## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

– కార్యకర్తలే నాయకులను గెలిపిస్తారు... టిపిసిసి అధ్యక్షులు





కబురు న్యూస్ బాన్సువాడ ఫిబ్రవరి 19
బాన్సువాడతో తనకు విడదీయరాని 40 ఏళ్ల అనుబంధం ఉందని రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణ శివారులోని ఎస్ఎంబి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బాన్సువాడ కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేక స్థానం ఉందని, విద్యార్థి సంఘ ఎన్నికల్లో 1986 సంవత్సరంలో ఇక్కడి నాయకులతో తనకు ఎంతో అనుబంధం ఉందని, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. బాన్సువాడ నియోజకవర్గం వ్యవసాయ ఆధారిత ప్రాంతం అన్నారు. దేశ చరిత్రలోనే ఒక రాష్ట్రం కుల సర్వే చేసి రాహుల్ గాంధీ కలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాకారం చేశారన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ బీసీలను అణగదొక్కారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో బలహీన వర్గాలకు పెద్దపీట వేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 మాసాల్లోనే 22 వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆదాని, అంబానీలకు ధారధత్తం చేస్తూ, పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన నరేందర్ రెడ్డిని గెలిపించాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిపించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ , మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మసూదర్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ కూనిపూర్ రాజ రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖలేఖ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు సురేష్ బాబా, హనుమంతు, దుర్గం శ్యామల, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నార్ల సురేష్ గుప్తా, నాయకులు శ్రీనివాస్ గౌడ్,అంబర్ సింగ్, కొట్టం మనోహర్, పిట్ల శ్రీధర్, రఘు, విజయ ప్రకాశ్,నార్ల నంద కిషోర్,అందే రమేష్, గౌస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాలేయ వ్యాధి గుర్తింపు ఉచిత పరీక్ష శిబిరం...

కబురు న్యూస్,బోధన్ ఫిబ్రవరి 19..
కాలేయ వ్యాధి గుర్తింపు కోసం బోధన్ పట్టణంలో ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ పెన్షనర్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని దయానంద్ గోశాల లో ఉచిత స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. వైద్యులు శ్రీకాంత్, కృష్ణ ప్రసాద్, స్రవంతి, రహీం లచే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్ 7702557778, జిల్లా సీనియర్ సిటిజన్స్ అద్దంకి ఉషాన్ 9959224984 లను సంప్రదించాలని సూచించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల సన్నహక సమావేశంలో పాల్గొన్న బాన్సువాడ నాయకులు



కబురు న్యూస్ కామారెడ్డి ఫిబ్రవరి 19
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య గార్డెన్ లో బుధవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి



సమక్షంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి బాన్సువాడ, నసురుల్లాబాద్ పార్టీ మండలాల అధ్యక్షులు, మంత్రి గణేష్, నందు పటేల్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భాను గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## ఆశీర్వదించండి పట్టభద్రుల సమస్యలను పరిష్కరిస్తా... అభ్యర్థి నరేందర్ రెడ్డి



కబురు న్యూస్ బాన్సువాడ ఫిబ్రవరి 19
పట్టభద్రుల సమస్యను పరిష్కరించేందుకు తనను ఆశీర్వదించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణ శివారులోని ఎస్ఎంబి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ సురేష్ షెట్కర్ పాల్గొని పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఎన్నికపై దిశా నిర్దేశం ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 56,000 ఉద్యోగాలను కల్పించిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్నాయన్నారు. నిరుద్యోగుల పక్షాన తన గొంతును మండలిలో వినిపించి ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుల సహకారంతో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పట్టబద్రులు తనను ఆశీర్వదించి శాసన మండలకి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ డిసిసిబి చైర్మన్ భాస్కర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్,స్థానిక నాయకులు, కార్యకర్తలు, పట్టబద్రులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుంది.. మంత్రి జూపల్లి కృష్ణారావు



కబురు న్యూస్ బాన్సువాడ ఫిబ్రవరి 19
కేంద్రం నుండి రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో బిజెపి ఎంపీలు విఫలమయ్యారని, రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణ శివారులోని ఎస్ఎంబి ఫంక్షన్ హాల్ లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ సురేష్ షెట్కర్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సభను ఉద్దేశించి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బిజెపితో లోపాయి గారి ఒప్పందం చేసుకొని రాజకీయంగా బిజెపికి లబ్ధి చేకూర్చడానికి ఎమ్మెల్సీ ఎన్నికలకు బిఆర్ఎస్ పార్టీ దూరమైందన్నారు. రాష్ట్రం నుండి 8 మంది ఎంపీలు ఉన్న కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి వచ్చింది సున్నా అని, కేంద్ర ప్రభుత్వం బీహార్, చత్తీస్ గడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు లక్షల కోట్ల నిధులను కేటాయించి రాష్ట్రానికి మాత్రం నిధులు ఇవ్వకపోవడం సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం కేసీఆర్ చేసిన అప్పులకే 86 వేల కోట్లు అప్పు తీసుకుని వడ్డీ మాత్రమే కడుతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 56వేల ఉద్యోగాలను కల్పించి జాబ్ క్యాలెండర్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదాన్నారు. పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాది పాలనను చూసి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావును కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డిలు శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్,మార్కెట్ కమిటీ చైర్మన్ లు సురేష్ బాబా, గైక్వాడ్ హనుమంతు, దుర్గం శ్యామల, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నార్ల సురేష్ గుప్తా, శ్రీనివాస్ గౌడ్, అంబర్ సింగ్, కూనిపూర్ రాజారెడ్డి, కొట్టం మనోహర్, లక్ష్మణ్, రఘు, బుజ్జి, పిట్ల శ్రీధర్,గంగుల గంగారం, నార్ల నందకిషోర్ గుప్తా, ఎజాస్, తోట అరుణ్,అందే రమేష్, గౌస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## హిందూ స్వరాజ్య స్థాపనకు ప్రాణాలను అర్పించిన యోధుడు ఛత్రపతి శివాజీ





కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఫిబ్రవరి 19 :
హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ హిందూ ధర్మ రక్షణ కోసం మొఘలులను ఎదిరించి,హిందూ స్వరాజ్య స్థాపనకు తన ప్రాణాలను అర్పించిన యోధుడని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలో బుధవారం ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ 395 వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్గం ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ విగ్రహాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఆవిష్కరించి,ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గాజుల్ పేట్,నాందేవాడ శివాజీ చౌక్ వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి,శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. శివాజీ మహారాజ్ వీరత్వానికి తల్లి జిజియా బాయ్ గొప్ప స్ఫూర్తి,చిన్నతనం నుంచే ఆయనను శత్రువులను ఎదిరించేలా తీర్చిదిద్దారని కొనియాడారు. మొఘలుల కాలంలో హిందువులను బానిసలుగా చేసి,మత మార్పిడులు బలవంతంగా జరిగించిన రోజుల్లో శివాజీ మహారాజ్ 17వ ఏటనే కత్తి చేతపట్టి జై భవాని అంటూ మొఘలులపై తిరుగుబాటు చేశారని తెలిపారు. నేటి యువత మొఘల్ చరిత్ర కంటే ఛత్రపతి శివాజీ, వీరసావర్కర్,భగత్ సింగ్,సుభాష్ చంద్రబోస్ లాంటి మహానుభావుల చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. హిందూ యువత మేల్కొని హిందూ ధర్మాన్ని పరిరక్షించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. 2048 నాటికీ హిందూ దేశంగా మార్చడానికి ప్రతి హిందూ యువకుడు ప్రతిజ్ఞ చేయాలని,ఛత్రపతి శివాజీ మహారాజ్ మార్గంలో నడవాలని కోరారు. లవ్ జిహాద్ హిందూ మతాన్ని టార్గెట్ చేసే కుట్రలను గుర్తించి,ప్రతి హిందువు తన ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. స్వామి వివేకానంద చెప్పినట్టు ఉక్కు నరాలు,ఇనుప ఖండరాలు,వజ్ర సంకల్పం కలిగిన యువతనే భవిష్యత్తు భారతదేశాన్ని నిర్మించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాజీ ఉత్సవ సమితి సభ్యులు,బీజేపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విధులు సక్రమంగా నిర్వహించకుంటే కఠిన చర్యలు... జోనల్ అధికారి పూర్ణచందర్



కబురు న్యూస్ బాన్సువాడ ఫిబ్రవరి 19 :
గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో ఉపాధ్యాయులు స్నేహపూర్వకంగా ఉండి పాఠాలు బోధించి సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని జోనల్ ఆఫీసర్ పూర్ణచందర్ అన్నారు. బుధవారం బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపులో గల బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాఠశాల సమస్యలపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా అయన ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 వ తేదీన పాఠశాలలో జరిగిన విద్యార్థిని కిడ్నాప్ ఘటన చాలా బాధాకరమని అన్నారు. విద్యార్థిని చాకచక్యంగా తప్పించుకొని తమ పాఠశాలను కాపాడిందని లేదంటే ఏదైనా అనుకోని ఘోరం జరిగి ఉంటే అందరికీ ఇబ్బంది జరిగేదన్నారు. కాగా కిడ్నాప్ గురైన విద్యార్థినిని కిడ్నాప్ కు పాల్పడిన యువకుడే పాఠశాలలో చేర్పించాడని, అతడు స్వయానా విద్యార్థినికి పెద్ద నాన్న కుమారుడని పేర్కొన్నారు. అదేవిధంగా పాఠశాలలో మిగిలిన ఆరోపణలు, విమర్శలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తానన్నారు. అంతే కాకుండా పాఠశాల గేటు ముందర భద్రతను కట్టుదిట్టం చేస్తామన్నారు. అంతేకాకుండా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అందరూ విద్యార్థినులతో కలుపుగోలుగా ఉండాలని, విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయ బృందం విద్యార్థినులు, పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మిస్సింగ్ మర్డర్ కేసును చేదించిన పోలీసులు

- జల్సాలకు అలవాటుపడి స్నేహితుడినే కడతేర్చిన స్నేహితుడు...
- ఇందల్వాయి అటవీ ప్రాంతంలో హత్య కేసును చేదించిన పోలీసులు...
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి...




**కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,ఫిబ్రవరి 19 :** నిజామాబాద్ నగరంలో సంచలనం రేపిన మిస్సింగ్ మర్డర్ కేసును పోలీసులు 24 గంటల్లోనే చేదించారు.జల్సాలకు అలవాటుపడిన పాత నేరస్తుడు డబ్బులు లేకపోవడంతో స్నేహితుడు వద్ద ఉన్న ఆటోను దొంగిలించి అమ్ముకునేందుకు అతన్ని దారుణంగా హత్య చేసినట్లు పోలీసుల విచారణ వెల్లడయింది.నిజామాబాద్ ఎసిపి రాజా వెంకట్ రెడ్డి హత్య కేసు వివరాలను విలేఖరుల సమావేశంలో వెల్లడించారు.ఇందల్వాయి అటవి ప్రాంతంలో గుర్తు తెలియని యువకుడి హత్య చేసి దహనం చేసిన వివరాలను స్థానికుల ద్వారా తెలుసుకోని పోలీసులు అక్కడికి చెరుకుని దర్యాప్తు ప్రారంబించారు.అది వరకు 15న తన భర్త కండేలా సందిప్ (28) కనిపించడం లేదని నిజామాబాద్ నగరంలోని నాగారం బ్రహ్మణ కాలనీకి చెందిన కండేలా లత ఐదవ టౌన్ పోలిస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. మిస్సింగ్ కేసుకు అటవీ ప్రాంతంలో హతుని వివరాలను పోలికలు ఉండటంతో నిజామాబాద్ నార్త్ రూరల్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగాధర్ లు ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో నాగారంకు 80 క్వార్టర్స్ కు చెందిన బైరగోని సతీష్ గౌడ్ ను బుదవారం మాదవనగర్ వద్ద అదుపులోకి తీసుకోవడంతో సందిప్ హత్య కేసు కోలిక్కి వచ్చింది. బైరగోని సతీష్ గౌడ్ పాత నేరస్తుడు. అతనిపై 2020 నుంచి దొంగతనం కేసులు నాలుగు నమోదయ్యాయి. దానితో పాటు వనస్థలిపురంలో బంగారు నగల కోసం మహిళను హత్య చేసిన కేసు విచారణలో ఉంది. సతీష్ గౌడ్ కు ఇదివరకే వివాహం జరిగిన భార్య భర్తల మద్య విబేదాలతే అతని బార్య హైద్రాబాద్ లో పుట్టింటిలో ఉంటుంది. ఎ పని చేయని సతీష్ గౌడ్ జల్సాల కోసం దోంగతనలు చేయడం అప్పుడప్పుడు నాగారం కు వస్తుపోతుండేవారు. నాలుగు సంవత్సరాల క్రితం అటో డ్రైవర్ గా పనిచేసే సందిప్ తో సతీష్ గౌడ్ కు స్నేహం కుదిరింది. కాని ఇటివల కాలంలో సతీష్ గౌడ్ వద్ద డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యేడు. డబ్బులు సులువుగా సంపాదించాలని ప్రయత్నిస్తుండగా ఇటివల సందిప్ ఆటో కోనుక్కుని తింపుతున్నట్టు గుర్తించాడు. అతనివద్ధ ఉన్న ఆటోను దోంగలించి అమ్ముకోవాలని ప్లాన్ వేశాడు సతీష్ గౌడ్.ఈ నెల 15న ఉదయం వేళ సందిప్ ఆటోలో ఎక్కి నగరం తో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో మద్యం,కల్లు సేవించారు. కామారెడ్డి వేలితే మంచి గిరాకి దోరుకుతుందని సందిప్ ను నమ్మించి ఆటోలో సతీష్ గౌడ్ కామారెడ్డికి పయనమయ్యారు.అప్పటికే మద్యం, కల్లు విపరీతంగా సేవించడంతో సందిప్ మత్తులో జోగుతున్నాడు.ఈదే అదనుగా ఇందల్వాయి మండలం చాంద్రయాన్ పల్లి ఆటవి ప్రాంతంలో ఉన్న కుంటవద్ధకు ఆటోను తీసుకువేళ్లారు.అక్కడ కాల్ల క్రుత్యాలు తీర్చుకునే నేపంతో కిందకు దిగిన సతీష్ అక్కడ అదను కోసం వేచి ఉన్నాడు.సందిప్ ఆటో దిగి కుంటవద్ధకు వెల్లగా అతడిని వెనుకనుండి తోసేసాడు.కిందపడిన సందిప్ పై బండరాయితో చాతీపై మోది హత్య చేశాడు. అక్కడే ఉన్న కట్టేలు, చేత్తతో సందిప్ డేడ్ బాడిని దహనం చేసి ఆటోను, సందిప్ మొబైల్ ను తీసుకుని హైద్రబాద్ కు పరారి అయ్యారు. బుదవారం మాదవనగర్ వద్ధ దోరికిన సతీష్ ను పోలీసులు తమదైన శైలీలో విచారించగా తానే సందిప్ ను హత్య చేసినట్లు ఓప్పుకోగా అతడివద్ధనుంచి సందిప్ కు చెందిన ఆటో, సెల్ పోన్ స్వాధినం చేసుకున్నారు. మిస్సింగ్,మర్డర్ కేసును 24 గంటల వ్యవధిలో చెందిన నార్త్ రూరల్ సిఐ, ఐదవ టౌన్ ఎస్ ఐలను సిబ్బందిని ఎసిపి రాజావేంకట్ రెడ్డి అభినంధించారు.

# ఊట్పల్లి లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు...



**కబురు న్యూస్,బోధన్ ఫిబ్రవరి 19..** బోధన్ మండలంలోని ఊట్ పల్లి గ్రామంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా చేపడుతున్న పనుల నాణ్యతను బుధవారం పంచాయతీ రాజ్ ఏఈ నిఖిత పరిశీలించారు. ఎంజిఎన్ఆర్ ఈజీఎస్ మంజూరైనా 10 లక్షల రూపాయల నిధులతో ఊట్పల్లి గ్రామం నుండి ఎరాజ్ పల్లి గ్రామం వరకు చేపడుతున్న మొరం రోడ్డు పనులు, 12లక్షల రూపాయలతో నిర్మించే నూతన అంగన్వాడీ భవన నిర్మాణాన్ని గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టప్పా సాయిలు తో కలిసి ఏఈ నిఖిత పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి కి, సహకరించిన టిపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, సంజీవ్ రెడ్డి, నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు నరేందర్ రెడ్డి లకు గ్రామ ప్రజలు, రైతులు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ ఆసువత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలి...




**కబురు న్యూస్,బోధన్ ఫిబ్రవరి 19..** ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా ఆరోగ్య వైద్య అధికారిణి రాజశ్రీ సూచించారు. బుధవారం బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ లో గల బస్తీ దవఖాణలో డివిజన్ మెడికల్ ఆఫీసర్స్, పర్యవేక్షకులకు ఫైలేరియా (బోధకాలు)పై అవగాహన కార్యక్రమం దాని నివారణ గురించి సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ మార్చి నెల 13,18, 23 తేదీలలో ఎంపిక చేయబడిన ప్రాంతాలలో రాత్రిపూట రక్త నమూనాలను సేకరించడం జరుగుతుందని అన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్, బోధన్ ఉప జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి సమత పాల్గొన్నారు.

# కోటగిరిలో బాలుర మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



పోతంగల్ పీ.హెచ్.సీ పరిశీలన...







**కబురు న్యూస్,నిజామాబాద్, ఫిబ్రవరి 19 :** కోటగిరిలో బాలుర మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పోతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.రెసిడెన్షియల్ స్కూల్ లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు,ఇతర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు.ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుండగా,సరిపడా ఫ్యాకల్టీ ఉన్నారా అని ప్రిన్సిపాల్ డాక్టర్ మొహమ్మద్ ముబీన్ ను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూంలను సందర్శించి, బియ్యం నిల్వలు, కూరగాయల నాణ్యతను, సరుకుల స్టాక్ ను పరిశీలించారు. వంట నూనె, పాలు,కోడిగుడ్ల నాణ్యత పరిశీలించిన కలెక్టర్, కాల పరిమితి ముగిసిన వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని నిర్వాహకులకు సూచించారు.పాఠశాల సముదాయాన్ని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.మెనూ పట్టికను పరిశీలించి,విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు.అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పోతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు.స్థానికంగా నిర్వహిస్తున్న రక్త పరీక్షలు,రోగులకు అందిస్తున్న చికిత్సల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రతి రోజు ఎంత మంది రోగులు చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్నారనే వివరాలను రిజిస్టర్లో పరిశీలించారు.అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యులకు సూచించారు.రోగులను పలుకరించి వారికి మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా,పీ.హెచ్.సీ లోనే ఔషధాలను అందిస్తున్నారా అని ఆరా తీశారు.సమయ పాలన పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని మెడికల్ ఆఫీసర్ కు, సిబ్బందికి సూచించారు.కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

# చత్రపతి శివాజీ వారసత్వాన్ని కొనసాగించాలి



**కబురు న్యూస్,నిజామాబాద్,లీగల్ ఫిబ్రవరి 19 :** ఛత్రపతి శివాజీ వారసత్వాన్ని కొంసాగించాల్సిన ఆవశ్యకత ఉన్నదని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ అన్నారు.ఛత్రపతి జయంతి సందర్భంగా బోర్గం(పి)గ్రామ ప్రధాన కూడలిలో గల శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు.భారతీయ ఆధ్యాత్మిక విలువలతో కూడిన పరిపాలన అందించిన గొప్ప పరిపాలకూడని ఆయన కొనియాడారు.యువతరమా శివాజీ అనుసరించిన అడుగులలో అడుగులు వేయండని జగన్మోహన్ ఉద్బోధించారు.ఈ కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి వసంత్ రావు,చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుభేదార్,న్యాయవాదులు ఆశ నారాయణ,పిల్లి శ్రీకాంత్,బాలాజీ,శివాజీ సేవా సమితి అధ్యక్షుడు లక్ష్మణ్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# మారేడుపల్లి గ్రామంలో ఘనంగా అంబటి మల్లన్న బోనాలు

- అంబటి మల్లన్న స్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

**కబురు న్యూస్ ఎండపల్లి ఫిబ్రవరి19:**



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామంలో అంబటి మల్లన్న స్వామి కోరిన కోర్కెలు తీర్చే దేవుడు అని ఇక్కడి భక్తుల నమ్మకం..ఇక్కడ ఒక సంవత్సరం బోనాలు,ఒక సంవత్సరం పట్నాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.అందులో భాగంగా బుదవారం రోజున అంబటి మల్లన్న స్వామి వారి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కులాలకు అతీతంగా ఇంటికో గంప నెత్తుకొని ఒగ్గు కళాకారులతో,డప్పు చప్పుళ్ళ నడుమ బారి ఊరేగింపుతో శివ సత్తులతో ఆలయ ప్రాంగణం వద్దకు చేరుకొని మల్లన్న ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేస్తారు.దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. మల్లన్న నామ స్మరణతో ఆధ్యాత్మిక నెలకొంది. బోనాల పండుగ సందర్భంగా ఉపవాస ధీక్షలో ఉండీ స్వామి వారికి మొక్కలు చెల్లించుకుంటారు.అంబటి మల్లన్న బోనాల జాతర సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.ఇక్కడికి వచ్చినా వారికి ఆలయ పక్షన ఘన స్వాగతం పలికి శాలువలతో సన్మానించారు. అనంతరం మెయిన్ రోడ్డు నుండి ఆలయం వరకు సీసీ రోడ్డు మరియు ఆలయ ఆవరణలో హమాక్స్ లైట్స్ కావాలని కోరగా వారు వెంటనే స్పందిచి త్వరలోనే పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. వేసవి కాలం సందర్భంగా భక్తుల కోసం గ్రామానికి చెందిన రావుల రవి మజ్జిగా పంపిణీ చేశారు..ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గుండాటి గోపిక,మండల అధ్యక్షుడు శైలందర్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు మురళి గౌడ్, బాలసాని మల్లేషం గౌడ్,రావుల రాయమల్లు, సురేష్ భూమయ్య తో పాటు యాదవ కులస్తులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని కాపాడాలి.... మహదేవ్ స్వామి

కోనాపూర్ లో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మహాదేవ్ స్వామి

**కబురు న్యూస్ బాన్సువాడ ఫిబ్రవరి 19**





హిందూ ధర్మం కోసం ప్రతి ఒక్కరు పాటుపడి తమ సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుడిమెట్ మహాదేవ్ స్వామి అన్నారు. బుధవారం బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామంలో శివాజీ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని మహాదేవ్ స్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో యువకులు, పెద్దలు, చిన్నారులు జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాదేవ్ స్వామి మాట్లాడుతూ హైందవ గొప్ప ధీరుడు చత్రపతి శివాజీ అని, ఆయన ఆశయాలను అడుగుజాడలో మనమందరం నడవాలన్నారు.ప్రతి ఒక్కరు తమ మతాన్ని ఆరాధిస్తూ సనాతన ధర్మం కోసం కృషి చేసినప్పుడే సమాజం మారుతుందని, యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దత్తపురం సాయిబాబా, మాజీ సర్పంచ్ వెంకటరమణారావు దేశ్ముఖ్, గాండ్ల సాయిలు, గంగాధర్,వేదేందర్, దాసరి సాయిబాబా,యువకులు,శివ స్వాములు, గ్రామస్తులు ,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ లో ఘనంగా చత్రపతి శివాజీ శోభాయాత్ర...

**కబురు న్యూస్,బోధన్ ఫిబ్రవరి 19..**



ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా హిందూ వాహిని బోధన్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రాకాసిపేట్ లో గల హనుమాన్ మందిరం నుండి ప్రధాన వీధుల గూండా అంబేద్కర్ చౌరస్తా వరకు ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహంతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహంతో పురవీధుల్లో నిర్వహించిన శోభాయాత్రలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మెడపాటి ప్రకాష్ రెడ్డి, బాలరాజు, సుధాకర్ చారి , హిందు వాహిని నాయకులు పులిసాయిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైల్వే కనెక్టివిటీ పెరిగితే శరవేగంగా అభివృద్ధి



– నిజామాబాద్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ డిస్టిక్ ప్రెసిడెంట్ ఆర్.జగదీశ్వరరావు...

**కబురు న్యూస్,నిజామాబాద్ రైల్వే,ఫిబ్రవరి 19 :** నిజామాబాద్ తెలంగాణ ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న నగరాలలో మొదట వరుసలో ఉంది అని ఐతే ఇక్కడ రైల్వే కనెక్టివిటీ పెరిగితే మరింత శరవేగంగా అభివృద్ధి చెందుతుంది అని నిజామాబాద్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ డిస్టిక్ ప్రెసిడెంట్ ఆర్.జగదీశ్వరరావు అన్నారు.ఈ అన్యువల్ సేఫ్టీ ఇన్స్పెక్షన్ లో భాగంగా నిజామాబాద్ రైల్వే స్టేషన్ ని సందర్శించడానికి వచ్చిన సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్,డిఆర్ యం. లోకేష్ వైష్ణోయిని కలసి బుధవారం వినతి పత్రం అందజేశారు. అధ్యక్షుడు జగదీశ్వర్ రావు మాట్లాడుతూ రైల్వే ట్రాక్ డబ్లింగ్,ప్లాట్ ఫామ్ లో విస్తరణ,మధ్యాహ్నం పీక్ హావర్స్ టైములో హైదరాబాద్,ముంబై వైపు ట్రైన్ వేయాలని కోరారు. అదే విధంగా ధర్మబాద్ లో పార్కింగ్ చేస్తున్న రైళ్ళని నిజామాబాదు వరకు నడపాలని,వందేభారత్ రైళ్లని ఇక్కడి వరకు పొడిగించాలని అన్నారు. ఉత్తరభారత్ పట్టణాలను కలుపుతూ రైళ్ళని నిజామాబాదు మీదుగా నడపాలని సూచించారు. గూడ్స్ షెడ్ ని వేరే చోటికి తరలించాలని,గూడ్స్ ట్రాన్స్పోర్ట్ సమస్యలు పరిష్కరించి వ్యాపారస్థులను ఆదుకోవాలని అన్నారు. అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిలను త్వరితగతిగా పూర్తి చేయాలనీ,నిజామాబాదు స్టేషన్ సర్వంగా సుందరంగా తీర్చిదిదాలని కోరారు. పసుపు,వరి రైతులకు సులభంగా తమ పంటను మార్కెట్ కి తరలించడానికి సహకరించాలని కోరారు. రైల్వే బ్రిడ్జి, డబ్లింగ్ పూర్తయితే పైన తెలిపిన అన్ని సమస్యలు పరిష్కరిస్తామని సానుకూలంగా స్పందిస్తూ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కమల్ ఇనాని,సభ్యులు శ్రీనివాస్ రావు,గంగాధర్ రావు,ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ బోర్డ్ ఏర్పాటుకు కృషి




– స్వతంత్ర అభ్యర్థి పులగం దేవిదాస్...

**కబురు న్యూస్,నిజామాబాద్ ప్రెస్ క్లబ్,ఫిబ్రవరి 19 :** గ్రాడ్యుయేట్ బోర్డ్ ఏర్పాటుతో ఉచిత విద్య ఉచిత వైద్యం అందించేందుకు కృషి చేస్తానని మెదక్,నిజామాబాద్,ఆదిలాబాద్ కరీంనగర్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పులగం దేవిదాస్ అన్నారు.నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పులగం దేవిదాస్ మాట్లాడారు.గ్రాడ్యుయేట్ బోర్డ్ స్వయం ప్రతిపత్తి సంస్థ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు.బోర్డులో ఐఏఎస్,ఐపిఎస్ ఆఫీసర్ల పాలనలో ప్రత్యేక అధికారాలతో పర్యవేక్షణకు కృషి చేస్తుందని అన్నారు.రాష్ట్రంలోని గ్రాడ్యుయేట్ లకు బోర్డు పరిధిలోకి తీసుకువచ్చి వారి సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు.గ్రాడ్యుయేషన్ తరువాత మూడేళ్ల పాటు రూ.10 వేల నిరుద్యోగ భృతి చెల్లించేందుకు కృషి చేస్తానని తెలిపారు.విదేశాల్లో ఉన్నత చదువులకు పేద విద్యార్థులకు ఫీజులు ప్రభుత్వం చెల్లించేలా కృషి చేస్తానని చెప్పారు.పోటీ పరీక్షలు ఉద్యోగ పరీక్షలకు వెళ్లే నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు.కార్పోరేట్ విద్యా సంస్థల్లో బిపిఎల్ విద్యార్థులకు ఉచిత విద్య అమలుకు కృషి చేస్తానని తెలిపారు.గిరిజన ఎజెన్సీలో నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు ప్రత్యేక డి.ఎస్.సి. నిర్వహణకు కృషి చేస్తానని చెప్పారు.ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఎజెన్సీ పరిధిలిలో లిగ్విస్టిక్స్,లిటరేచర్,ఆర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు.నాలుగు జిల్లాల పరిధిలో ఉన్న ఐఐటి లోని విద్యార్థులకు కనీస సౌకర్యాలతో పాటు విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## విద్యుత్ లైన్ మెన్ ఇంట్లో చోరీ

– ఐదు తులాల బంగారం, 80 వేల నగదు అపహరణ...

**కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,ఫిబ్రవరి 19 :** నిజామాబాద్ నగరంలోని గాజుల్ పేట్ లో విద్యుత్ శాఖలో లైన్ మెన్ గా పనిచేసే అజిత్ సింగ్ ఇంటిలో చోరి జరిగింది.ఈ విషయం బుదవారం ఉదయం వెలుగు చూసింది. గాజుల్ పేట్ కడ్డా ప్రాంతంలో నివాసం ఉండే అజిత్ సింగ్ కుటుంబ సమేతంగా బందువుల ఇంటిలో జరిగిన రిసెప్షన్ కు వెళ్లారు.గుర్తు తెలియని వ్యక్తులు అజిత్ సింగ్ ఇంటి తాళాలు పగులగొట్టి,పడక గదిలో బీరువా ధ్వంసం చేసి ఐదు తులాల బంగారం, 80 వేల నగదు చోరి చేశారు.ఉదయం వేళ ఇంటితాళాలు పగుల గొట్టిన విషయం తెలిసి అజీత్ సింగ్ కుటుంబానికి సమాచారం అందడంతో బాధితులు పోలిసులకు పిర్యాదు చేశారు.రెండవ టౌన్ పోలీసులు ఘటన స్థలం చేరుకుని విచారణ చేపట్టారు.



# విహారయాత్రకు తరలిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు...








**కబురు న్యూస్,బోధన్ ఫిబ్రవరి 19..** బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసి) విద్యార్థిని,విద్యార్థులు బుధవారం హైదరాబాద్ నగరంలోని పర్యాటక ప్రాంతాలను వీక్షించడానికి తరలి వెళ్లారు. హైదరాబాద్ నగరంలోని సాలార్జంగ్ మ్యూజియం ను సందర్శించి అందులోని రాజుల కాలం నాటి వస్తు ప్రదర్శనను తిలకించారు. పురాతన కాలం నాటి వస్తువులను చూసి ఉపాధ్యాయులతో వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం నెహ్రూ జూ పార్క్ లో జంతు ప్రదర్శనలను సందర్శించి వివిధ రకాల జంతువులను చూశారు. అనంతరం గోల్కొండ కోటలోని ప్రాంతాన్ని పరిశీలించి, ఆనాటి కట్టడాలను కోట చరిత్రను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 400 మంది విద్యార్థులు వాహనాలలో తరలి వెళ్లారు. వారి వెంట ప్రధానోపాధ్యాయులు బాలచంద్రం, ఉపాధ్యాయులు రామ్మోహన్, వెంకట్, కృష్ణ, స్నేహ, కళ్యాణి, జ్యోతి, అఫ్సాన్ మహేజాబిన్, అర్షద్, ఖైరాన్, కామేశ్వరీ, రాజ్యలక్ష్మి, ప్రసన్న, రాజన్న తదితరులు ఉన్నారు.

# ఇబ్రహీంపేట్ లో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన పిట్ల కృష్ణ మహారాజ్..







– ధర్మ పరిరక్షణకు పాటుపడాలి... మహారాజ్

**కబురు న్యూస్ బాన్సువాడ ఫిబ్రవరి 19** ధర్మ రక్ష పరిరక్షణకు పాటుపడుతూ హిందూ ధర్మాన్ని కాపాడే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాలయోగి పిట్ల కృష్ణ మహారాజ్ అన్నారు. బుధవారం బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట గ్రామంలో హిందూసేన ఆధ్వర్యంలో శివాజీ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన శివాజీ విగ్రహాన్ని బాలయోగి పిట్ల కృష్ణ మహారాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం పాటుపడాలని, చిన్ననాటి నుండి చిన్నారులకు భగవద్గీత అందించి హిందూ మతం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. చత్రపతి శివాజీ మహారాజ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ పోరాట తత్వాన్ని, ప్రశ్నించే తత్వాన్ని నేర్చుకొని సాగాలన్నారు. హిందూ సేన ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు వరకు కృషి చేసిన వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హిందూ సేన సభ్యులు, గ్రామస్తులు, యువకులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# మహాసభ విజయవంతం కోసం 33 జిల్లాల బాధ్యులు సమాయత్తం కావాలి

- కందగట్ల స్వామి...
- వేలాదిగా తరలించి మహాసభను దిగ్విజయం చేయండి...
- జిల్లా బాద్యులకు దిశ నిర్దేశం...
- గడ్డం జగన్నాథం...
- మహసభకు 30 వేల పద్మశాలీలు పాల్గొనే మహాసభకు అన్ని రకాల ఏర్పాట్లు..కామర్తపు మురళి...
- మార్చి 9న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరిగే పద్మశాలి మహాసభను విజయవంతం చేయండి..
- మాచర్ల రామచందర్ రావు...







**కబురు న్యూస్,హైదరాబాద్,ఫిబ్రవరి 19 :** పద్మశాలీల సంఘటితం రాజకీయ వాటా చేనేతరంగా సమస్యల సాధనకై అఖిలభారత పద్మశాలి సంఘం తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్చ్ 9న 17వ అఖిలభారత పద్మశాలి మహాసభ 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలిల మహాసభ హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరిగే సభ విజయవంతం కోసం రాజకీయాలకతీతంగా తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల పద్మశాలీలంతా కదలి రావాలని అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళిలు పిలుపునిచ్చారు.బుధవారం హైదరాబాద్ నారాయణగూడ పద్మశాలి సంఘ భవన్లో మహాసభ రిసెప్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సన్నాక సమావేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్ష కార్యదర్శులు కందగట్ల స్వామి,గడ్డం జగన్నాథంలు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమ్మర్తపు మురళిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,మహాసభ విజయవంతం కోసం 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో సభ విజయవంతం కోసం కమిటీలను ఎన్నుకోవడం జరిగిందన్నారు ఆల్ ఇండియా అన్ని రాష్ట్రాల పద్మశాలి చేనేతలు అన్ని పార్టీలలో ఉన్న పద్మశాలి ప్రజాప్రతినిధులు ప్రముఖులు పద్మశాలి దిగ్గజాలు దాదాపు 30 వేలకు పైగా పాల్గొని ఈ మహాసభకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడానికి సమయత్తం అవుతున్నామని వారు పేర్కొన్నారు.జిల్లాలో అధ్యక్ష కార్యదర్శులకు జన సమీకరణతో పాటు అన్ని రకాల సౌకర్యాల కల్పన కోసం జిల్లాల బాధ్యులతో సమీక్షించి వారికి దిశనిర్దేశం చేశారు.అత్యంత ప్రతిష్టంగా చేపట్టే, పద్మశాలి సావనీరు బుక్ పబ్లికేషన్ కోసం,అడ్వర్టైజ్మెంట్ సేకరణ చేయాలని జిల్లా అధ్యక్ష కార్యవర్గ బృందాలకు సూచించారు గడ్డం జగన్నాథం మాట్లాడుతూ మార్చు 9న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరిగే మహాసభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని ఈ మహా సభకు భారతదేశ వ్యాప్తంగా,అన్ని రాష్ట్రాల పద్మశాలి ప్రముఖు పద్మశాలి అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు పద్మశాలి దిగ్గజాలు రానున్నారని,వారందరికీ హైదరాబాద్ నగరంలో వసతి ఏర్పాటు చేయనున్నామని వారు పేర్కొన్నారు.ఈ మహాసభ విజయవంతం కోసం ఏర్పాటుచేసిన రిసెప్షన్ కమిటీలన్నీ సభ విజయవంతం కోసం సమిష్టిగా కృషిచేసి సభను విజయవంతం చేయాలని సూచించారు.కమార్తపు మురళి మాట్లాడుతూ మహాసభ విజయవంతం కోసం 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేస్తూ జిల్లాల పర్యటన చేస్తూ యావత్ పద్మశాలి సమాజాన్ని సమాయత్తం చేస్తున్నామని, ఆయన పేర్కొన్నారు.మహాసభ విజయవంతం కోసం పలు కమిటీల బాధ్యులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం యువజన సంఘం అధ్యక్షుడు సంఘ శ్రీనివాస్ యువజన విభాగం జాతీయ ఇన్చార్జ్ అవ్వారి భాస్కర్,అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ అధ్యక్షులు సంఘ శ్రీనివాస్,జాతీయమహిళా అధ్యక్ష కార్యదర్శిలు వనం దృశ్యంతల,చిలువేరు సునీత,తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచందర్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు గుంటక రూప తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర రాజకీయ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మ ప్రవల్లిక, పద్మశాలి సంఘం విశ్వనాథం,ఇంజనీరింగ్ విభాగ అధ్యక్షులు పుట్ల పాండురంగ రాష్ట్ర సంఘం ప్రతినిధులు జిల్లా బాధ్యులు మెతుకు సత్యం బొమ్మ రఘురాం,చిక్క వెంకటేశ్వర్లు శ్రీధర్ శ్రవణ్,జేల్లా నరేందర్ గ్రేటర్ అధ్యక్షులు,కత్తుల సుదర్శన్,ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి రాజు,గ్రేటర్ యువజన అధ్యక్షులు చిన్ని రాకేష్, నక్క వేణుమాధవ్,రాష్ట్ర మీడియా అధ్యక్షులు బొమ్మ అమరేందర్ తో పాటు మహిళ ప్రతినిధులు స్వప్న,రేఖ,అర్చనపల్లి సుజాత,కడవేరు అర్చన,పులిపాటి సుకన్య, తదితరులు పాల్గొన్నారు

## మెట్పల్లి గీత కార్మిక కార్యవర్గానికి ఘన సన్మానం

**కబురు న్యూస్, ప్రతినిధి,మెట్ పల్లి, ఫిబ్రవరి 19.** మెట్పల్లి పట్టణ గీతా కార్మిక సహకార సంఘ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కార్యవర్గానికి బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మా నిలిచారు. అధ్యక్షులుగా వరుసగా రెండోసారి ఎన్నికైన పూదరి సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన చర్లపల్లి రాజేశ్వర్గౌడ్ లతో పాటు డైరెక్టర్లు ఏనుగందుల శ్రీనివాస్ గౌడ్, పొన్నం శ్రీనివాస్ గౌడ్, గుండవేని ప్రణయ్ గౌడ్ ,గొట్టిపడ్డ రాజేందర్ గౌడ్, బక్కూరి రమేష్ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం వారికి మిఠాయిలు తినిపించారు ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్లపల్లి రామా గౌడ్, జిల్లా అధ్యక్షులు చెట్ల చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్ గౌడ్, కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షులు ఏపూరి శ్రీనివాస్ గౌడ్ నాయకులు చర్లపల్లి చిన్న అంజగౌడ్ ముంజ సత్యనారాయణ గౌడ్ జోగున్పల్లి రాజేశ్వర్గౌడ్ చెట్లపల్లి అశ్విన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కబురు తెలుగు దినపత్రిక KABURU TELUGU DAILY



# ఛత్రపతి శివాజీ 395 వ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు





**కబురు న్యూస్, హుజురాబాద్ నియోజకవర్గం ఫిబ్రవరి 19**

ఇల్లందకుంట మండల కేంద్రంలో చత్రపతి శివాజీ 395వ జయంతి వేడుకను మండల అధ్యక్షుడు ఇరువాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు ఇంగిలే రామారావు హాజరయ్యారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద చత్రపతి చిత్రపటానికి పాలాభిషేకం పూలమాల వేసి కేక్ కట్ చేసి స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ: ఛత్రపతి శివాజీ మహారాజ్ ఒక గొప్ప యోధుడని , భారతదేశంలో మరాఠా సామ్రాజ్య స్థాపనకు ఛత్రపతి శివాజీ తన పాలన అంతటా, మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా అనేక యుద్ధాలు చేశాడు, వాటిలో సింహగడ్ యుద్ధం మరియు అతని రాజ్య రక్షణ ఉన్నాయి.



శివాజీ మహారాజ్ ఏప్రిల్ 3, 1680న అనారోగ్యం కారణంగా మరణించాడు, కానీ అతని వారసత్వం అతని వారసుల ద్వారా కొనసాగింది మరియు విదేశీ శక్తులకు వ్యతిరేకంగా మరాఠాల ప్రతిఘటనను ప్రేరేపించి. అతను ఒక దార్శనిక నాయకుడిగా, న్యాయమైన పాలకుడిగా మరియు ధైర్యం మరియు స్వాతంత్ర్యానికి చిహ్నంగా గుర్తుంచుకుంటామని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చత్రపతి శివాజీ జయంతి వర్ధంతి వేడుకలను ఆయా ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఇంగిలే ప్రభాకర్, గైకోటి రాజు, తిప్పారపు వీరన్న, కరటపల్లి రాజు, ఎర్రబాటి రమేష్, మాజీ ఉపసర్పంచ్ రవికుమార్, శ్రీనివాస్, బాబురావు, రమేష్ తో పాటు ఆరెకుల బాంధవులు పాల్గొన్నారు.



## శ్రీరాములపల్లి

ఇల్లందకుంటమండలం శ్రీరాముల పల్లి మండలం లో శ్రీ శ్రీ శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి నీ నిర్వహించనైనది.. ఛత్రపతి శివాజీ 17 ఏళ్ల వయస్సు లో తన తల్లి పిలుపు మేరకు కత్తి చేత బట్టి 390పైగా యుద్దాలు చేసే విజయం సాధించారు ఒరంగజేబు మొగుళ్ళులలో పాలన నలో ప్రజలను.. మహిళలపైన అరాచకాలు ఎక్కువైన సందర్భంలో యుద్ధం చేసే ప్రజలను కాపాడినారు. అని పలువురు వక్తలు కొనియాడారు... ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇంగిలే రామారావు.. జిల్లా సోషల్ మీడియాలో కన్వీనర్ టీ. వీరన్న. డివిజన్ అధ్యక్షుడు ఇ . ప్రభాకర్.. గ్రామ శాఖ అధ్యక్షుడు గారంపల్లి అగ్రయ్య మండల అధ్యక్షుడు ఇరువాల శ్రీనివాస్ ఇల్లందకుంట మండల యూత్ అధ్యక్షులు గైకోటి రాజు మరియు కుల సంఘాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆరే కుల సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 395 వ జయంతిని ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ దేశభక్తికి, దైవభక్తికి, ధైర్యానికి మారుపేరు..బినవతరానికి స్ఫూర్తి ప్రదాత ఛత్రపతి శివాజీ మహారాజ్ అని దండయాత్రలను ఎదిరించి నిలిచిన యుద్ధ వీరుడు, కోట్లాది భారతీయుల స్ఫూర్తిదాయకుడు, మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించిన యోధుడు,అని శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆ పోరాట వీరుడికి ఇవే మా ఘన నివాళులుఅని చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి సీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అదర్ సండే నాగేశ్వరరావు డివిజన్ ఇంచార్జ్ ఇంగిలే ప్రభాకర్ ఆరే సంఘం నాయకులు గుండెకారి మధు అంబరగొండ బాపురావు అంబరగొండ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఫామ్ హౌస్ లో పడుకున్న కేసీఆర్ కు కాంగ్రెస్ అభివృద్ధి,సంక్షేమం ఎక్కడ కనిపిస్తుంది

**– టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్...**

**కబురు న్యూస్, నిజామాబాద్ ఫిబ్రవరి 18 :**



ఫాం హౌస్ కి పరిమితమైన కేసీఆర్ కు ప్రతిపక్ష హోదా ఎందుకు అని,ఫామ్ హౌస్ లో పడుకున్న మీకు కాంగ్రెస్ అభివృద్ధి,సంక్షేమం ఎక్కడ కనిపిస్తుందని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో బుధవారం టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ,కేసిఆర్ కుంభ కర్ణుడి నిద్రలేచి బయల్దేరాడని,సీఎంపైన,మంత్రుల మీద నోరు పారేసుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. తెలంగాణ ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పిన కేసీఆర్ తీరు మారలేదని, అధికారం కోసం గుంట నక్కలా కేసీఆర్ ఎదురుచు చూసిన ఫలితం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఓపికను పరీక్షించ వద్దని హెచ్చరిస్తున్నామని, తెలంగాణలో ప్రజాపాలన నడుస్తోందన్నారు.కేసిఆర్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందని,బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిపోయిన సీఎంఆర్ఎఫ్,చెక్కుల బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.కాంగ్రెస్ అభివృద్ధి,సంక్షేమం చూసి ఓర్వలేక కేసిఆర్ అండ్ కో ఓర్వలేకపోతోందన్నారు.వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయ ముఖ చిత్రంలో బీఆర్ఎస్ ఉండదని జోస్యం చెప్పారు. కారు పార్టీకి ఎన్ని రిపేర్లు చేసిన ఫలితం శూన్యమని ఎద్దేవా చేశారు.కేసిఆర్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని,పార్టీ ఫిరాయింపు ల గురించి మాట్లాడానికి కేసీఆర్ కు సిగ్గు ఉండాలన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్,బీజేపీ కుట్రలను తిప్పి కొట్టి కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి మోసం చేసిన బీజేపీ పార్టీకి ఓటేస్తారా, ఏడాదిలో 56 వేలు ఉద్యోగాలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తారా తేల్చుకోండని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎక్సైజ్, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి క్రిష్ణారావు,జిల్లాకు చెందిన మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి,ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ ఆలీ,మాజీ ఎమ్మెల్సీలు జీవన్ రెడ్డి,అరికెల నర్సారెడ్డి,వర్ధన్నపేట్ ఎమ్మెల్యే నాగరాజు,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ రెడ్డి,కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు,పట్టభద్రులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందనున్న అధికారికి ఆత్మీయ సన్మానం



**కబురు న్యూస్, రామగిరి ఫిబ్రవరి 19.**

బుధవారం జి.ఎం.కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న హైదరాబాద్ మార్కెటింగ్ విభాగం జనరల్ మేనేజర్ డి.రవి ప్రసాద్ ను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ఏరియాలోని వివిధ గనులు,విభాగాధిపతులతో కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డి.రవి ప్రసాద్ సింగరేణి సంస్థలో సుమారు 39 సంవత్సరాలకు పైగా వివిధ ఏరియాలలోని గనులు,విభాగాలలో,వివిధ హోదాలలో విధేయతతో,అంకిత భావంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు. ఎన్నో సంస్కరణలు చేపట్టి ఉన్నతాధికారుల మన్ననలు పొందారన్నారు.ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజీఎం బి.సత్య నారాయణ,ఫైనాన్స్ ఎ.జి.ఎం పి.శ్రీనివాసులు,ప్రాజెక్ట్ అధికారి సి.హెచ్. వెంకటరమణ,అధికారులు కె.చంద్ర శేఖర్, పి.రాజారెడ్డి,డి.జనార్దనరెడ్డి,రాజేంద్ర కుమార్, బి.సుదర్శనం,నాగేశ్వరరావు,షబ్బీరుద్దీన్,ఐలయ్య, రాజేశ్వరి,విభాగాధిపతులు,అధికారులు పాల్గొన్నారు.

# పాపయ్యపల్లి గ్రామంలో చత్రపతి శివాజీ 395వ జయంతి వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించిన..

**కబురు న్యూస్, జమ్మికుంట ఫిబ్రవరి 19**



జమ్మికుంట మండలం పాపయ్యపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను గ్రామ అధ్యక్షుడు మోకిడి రాములు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు .గ్రామ ప్రధాన కూడలిలో ఉన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూల మాల వేసి, కేక్ కట్ చేసి స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అధరిసండి నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.అనంతరం నాయకుడు మాట్లాడుతూ:ఛత్రపతి శివాజీ మహారాజ్, ఫిబ్రవరి 19, 1630న మహారాష్ట్రలోని శివనేరి కోటలో జన్మించి, షాహాజీ భోసలే , జిజాబాయి దంపతుల కుమారుడు. నిరంతర సంఘర్షణలో పెరిగిన ఆయనలో చిన్నప్పటి నుంచీ నాయకత్వ నైపుణ్యాలు న్యాయ భావన అలవడింది. 16 సంవత్సరాల వయస్సులో, ఆయన తన మొదటి కోట అయిన టోర్నాను స్వాధీనం చేసుకున్నాడు ,మరిత్నే తన భూభాగాన్ని విస్తరించడం ప్రారంభించాడు. 1647 నాటికి, ఆయన పూనే ను తన ఆధీనంలోకి తీసుకున్నారు, మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించాలనే తన అన్వేషణకు నాంది పలికారు. తన వినూత్న సైనిక వ్యూహాలకు, ముఖ్యంగా గెరిల్లా యుద్ధానికి ప్రసిద్ధి చెందిన శివాజీ, రాయ్‌గడ్, సింహగడ్ మరియు పురంధరతో సహా అనేక కీలక కోటలను స్వాధీనం చేసుకున్నాడని , పశ్చిమ భారతదేశం అంతటా తన ప్రభావాన్ని విస్తరించారు. 1674లో, ఆయన రాయ్‌గడ్ కోటలో ఛత్రపతిగా పట్టాభిషేకం చేయబడ్డాడు, తన అధికారాన్ని పటిష్టం చేసుకున్నాడు.తన పాలన అంతటా, అతను మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా అనేక యుద్ధాలు చేశాడు, వాటిలో సింహగడ్ యుద్ధం మరియు అతని రాజ్య రక్షణ ఉన్నాయి. శివాజీ మహారాజ్ ఏప్రిల్ 3, 1680న అనారోగ్యం కారణంగా మరణించాడు, కానీ అతని వారసత్వం అతని వారసుల ద్వారా కొనసాగింది విదేశీ శక్తులకు వ్యతిరేకంగా మరాఠాల ప్రతిఘటనను ప్రేరేపించింది. అతను ఒక దార్శనిక నాయకుడిగా, న్యాయమైన పాలకుడిగా మరియు ధైర్యం మరియు స్వాతంత్ర్యానికి చిహ్నంగా గుర్తుంచుకుంటరని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి,వర్ధంతి వేడుకలు అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ వజ్జపల్లి ఆగయ్య, ఉపాధ్యక్షులు చంద్రమౌళి, కమిటీ సభ్యులు రాకేష్, సురేష్, నాగరాజు, బాబురావు, చంద్రం, ఆలయ చైర్మన్ గొండే శ్రీనివాస్,రాజు, తో పాటు ఆరె కుల బంధువులు,గ్రామస్తులు, పాల్గొన్నారు

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని..

**– ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఉత్తరాలు...**

**– జిల్లా కన్వీనర్ కుమారస్వామి...**

**కబురు న్యూస్, శంకరపట్నం ఫిబ్రవరి 19**



తెలంగాణలో మూడోసారి జరిగిన శాసనసభ ఎన్నికల ముందు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వ నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా చైర్మన్ కన్వీనర్ కనకం కుమారస్వామి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ ఉత్తరాలను వేసినట్లు కుమారస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకరపట్నం మండల ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు, జర్నలిస్టు దేవునూరి అంకుస్, జిల్లా నాయకులు ,తదితరులు పాల్గొన్నారు

# ఈ-బైక్ షోరూమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి...

**కబురు న్యూస్, శంకరపట్నం ఫిబ్రవరి 19**





గన్నేరువరం మండల కేంద్రంలో శ్రీ విహార్ ఎలక్ట్రికల్ బైక్ షోరూమ్ ను మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు ఆదరణ పెరుగుతోందన్నారు. పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలకు ప్రత్యామ్నాయంగా ప్రజలు ఈవీలపై మొగ్గు చూపుతున్నారని ఆయన పేర్కొన్నారు. అందుకే రోజురోజుకు ఎలక్ట్రిక్ బైక్ లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. డిమాండ్ కు అనుగుణంగా తయారీ సంస్థలు కొత్త ఫీచర్లతో అనేక మోడళ్లను మార్కెట్ లోకి ప్రవేశపెడుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణ బైక్ డ్రైవింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో విహార్ ఎలక్ట్రికల్ బైక్ షోరూమ్ యజమాని బుర్ర శ్రీధర్, గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు రత్నాకర్ రెడ్డి, పార్టీ జిల్లా నాయకుడు అనంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బుర్ర శ్రీకాంత్ గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్ , పార్టీ నాయకులు బొడ్డు సునిల్, దొగ్గని ప్రదీప్,నల్ల చంద్రారెడ్డి, తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కుదిరితే అదిరినట్టే!





టాలీవుడ్‌లో కలయికల కబుర్లు చాలానే వినిపిస్తుంటాయి. ఫలానా స్టార్, ఫలానా దర్శకుడితో జట్టు కడుతున్నాడనో... గతేడాది హిట్ కొట్టిన కాంబినేషన్‌లో మరో సినిమా సెట్ అయ్యిందనో చెప్పుకుంటూనే ఉంటారు. సినిమా ఆఫీసుల్లో అలా చర్చలు ముగుస్తాయో లేదో, ఆ వెంటనే ఆ కబుర్లు బయటికొస్తాయి. అంతే వేగంగా ఆ హీరోల సరసన ఆడిపాడే నాయికలు వీళ్లే అంటూ మరికొన్ని సంగతులు ప్రచారంలోకి వస్తుంటాయి. అలా కొన్ని క్రేజీ కాంబినేషన్లు... వాటిలో నటించే అవకాశం అందుకున్నారంటూ కథానాయికల కబుర్లు చిత్రసీమలో బలంగా వినిపిస్తున్నాయి. కుదిరిందంటే మాత్రం కలయిక అదిరిపోయినట్టే అనేది సినీ ప్రేమికుల మాట.

కథల కంటే... కలయికల్నే బలంగా నమ్మే చిత్ర పరిశ్రమ ఇది. మార్కెట్ కోణంలోనూ... సక్సెస్ పరంగానూ ఆకర్షణీయంగా ఉందనుకున్న కలయిక ఓ తాటిపైకొచ్చాక సిద్ధమయ్యే కథలు చాలానే! అందుకే ముందు తెలుగు చిత్ర పరిశ్రమలో కాంబినేషన్ల సంగతులే ప్రచారంలోకి వస్తుంటాయి. అందులో హీరో - దర్శకులు మాత్రమే కాదు... హీరోయిన్లు కూడా భాగమే!

## రష్మిక మరోసారి?

అగ్ర దర్శకుడు సుకుమార్ వరుసగా తెరకెక్కించిన 'పుష్ప' సినిమాలతో రష్మికని శ్రీవల్లిగా మార్చేశారు. ఆ పాత్రలో ఆమె ఒదిగిపోయిన తీరు, నటన ప్రేక్షకుల్ని ఎంతగానో మెప్పించింది. రష్మిక మరోసారి సుకుమార్ సినిమాలో నటిస్తున్నారనేది తాజా సంగతి. సుకుమార్ తన తదుపరి చిత్రాన్ని రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. అందులోనే కథానాయికగా రష్మిక పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఫౌజీ' సినిమాలో అలియాభట్ ఓ పాత్రని పోషిస్తున్నారనే మాట కూడా వినిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమాలో ఇమాన్వి కథానాయికగా నటిస్తోంది. మరో నాయికగా అలియా భట్ నటిస్తారా? లేక ఓ కీలక పాత్రలోనా అనేది తేలాల్సి ఉంది.

## బోర్సే.. జోర్‌సే

'మిస్టర్ బచ్చన్' సినిమాతో పరిశ్రమని ప్రముఖంగా ఆకర్షించిన కథానాయిక భాగ్యశ్రీ బోర్సే . ఆమె ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన 'కింగ్‌డమ్'లో నటిస్తోంది. రామ్, దుల్కర్ సల్మాన్ సరసన సినిమాలు చేస్తోంది. మరోవైపు తమిళం నుంచీ వెల్లువెత్తుతున్న అవకాశాలతో బిజీగా గడుపుతోంది. ఆమె సూర్య సినిమాలో కథానాయికగా ఖరారైందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పిన కథకి సూర్య పచ్చజెండా ఊపారని, అందులోనే భాగ్యశ్రీ కథానాయికగా నటిస్తుందని తెలుస్తోంది.

## ముందు వినిపించేది జాన్వీ పేరే!



కొన్ని రోజులుగా అల్లు అర్జున్ కథానాయకుడిగా, అట్లీ దర్శకత్వంలో సినిమాపై చర్చ సాగుతోంది. హీరో, దర్శకుడి మధ్య కథా చర్చలు జరుగుతున్నాయని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఇంకా అధికారిక వివరాలేవీ బయటికి రాలేదు. ఇంతలోనే ఇందులో కథానాయిక పాత్ర కోసం జాన్వీ కపూర్ పేరుని పరిశీలిస్తున్నట్టు మరో కబురు వినిపిస్తోంది. జాన్వీ ప్రస్తుతం రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తోంది. బుచ్చిబాబు సానా ఆ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'దేవర'తో ఘన విజయాన్ని సొంతం చేసుకున్న ఆమె, తెలుగు పరిశ్రమని ప్రముఖంగా ఆకర్షిస్తోంది. అందుకే కొత్తగా మొదలయ్యే ప్రతి సినిమా విషయంలోనూ ఆమె పేరుని ప్రథమంగా పరిశీలనలోకి తీసుకుంటున్నారు. 'దసరా' తర్వాత నాని - శ్రీకాంత్ ఓదెల కలిసి చేస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రానికీ ఆమె పేరుని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.

# 'కిల్' దర్శకుడితో విజయ్ దేవరకొండ?

'కింగ్‌డమ్' తర్వాత హీరో విజయ్ దేవరకొండ చేయనున్న రెండు సినిమాలపై ఇప్పటికే స్పష్టత వచ్చేసింది. వాటిలో రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహించనున్న కొత్త చిత్రం త్వరలో చిత్రీకరణ ప్రారంభించుకోనుండగా.. ఆ వెంటనే రవి కిరణ్ కోలా దర్శకత్వంలో మరో సినిమా పట్టాలెక్కనుంది . అయితే ఈ రెండూ ఇంకా సెట్స్‌పైకి వెళ్లకముందే విజయ్ మరో ప్రాజెక్ట్ విషయమై చర్చలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. గతేడాది వచ్చిన 'కిల్' సినిమాతో సినీప్రియుల దృష్టిని ఆకర్షించారు బాలీవుడ్ దర్శకుడు నిఖిల్ నగేశ్ భట్. ఇప్పుడాయన విజయ్ దేవరకొండతో ఓ సినిమా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. దీనికోసం ఆయన ఓ లవ్ - యాక్షన్ కథను సిద్ధం చేసుకున్నారని తెలిసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన కథా చర్చలు మొదలయ్యాయని.. నిఖిల్ చెప్పిన ఆలోచన విజయ్‌కు నచ్చిందని వార్తలు వినిపిస్తున్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ ప్రాజెక్ట్ కరణ్ జోహార్ నిర్మాణంలో వచ్చే ఏడాది చివర్లో సెట్స్‌పైకి వెళ్లే అవకాశముంది.



# ధమాల్ 4కు సన్నాహాలు

ఇటీవలే 'ఆజాద్' సినిమాతో ప్రేక్షకులను పలకరించిన బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ . ఆయన ప్రధాన పాత్రలో నటించిన కామెడీ డ్రామా చిత్రం 'టోటల్ ధమాల్'. ఇంద్ర కుమార్ తెరకెక్కించారు. ఇప్పటికే ఈ సినిమా ఫ్రాంచైజీలుగా విడుదలై సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి నాలుగో భాగాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొనసాగింపు కథనంతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తి చేసుకున్న ఈ సినిమా మార్చిలో షూటింగ్ ప్రారంభించుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అజయ్ దేవగణ్ 'రైడ్ 2', 'దే దే ప్యార్ దే 2' తదితర చిత్రాలతో బిజీగా ఉన్నారు.


అజయ్ దేవగణ్

# రజనీతో పూజ డ్యాన్స్.. డ్యాన్స్?

కథానాయకుడు రజనీకాంత్.. దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'కూలీ' సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమాకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఇందులో 'జైలర్'లోని "కావాలయ్యా" పాట తరహాలో ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. దీనికోసం కోసం పూజా హెగ్డేను రంగంలోకి దించనున్నారని సమాచారం. ఇప్పటికే ఈ విషయమై ఆమెతో సంప్రదింపులు పూర్తయినట్లు తెలుస్తోంది. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో.. రజనీ మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఆమిర్ ఖాన్, నాగార్జున ఉపేంద్ర, శ్రుతిహాసన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టులో థియేటర్లలోకి వచ్చే అవకాశముంది. దీనికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు





Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kabrueveningdaily9106@gmail.com